ప్రజల చెంతకు సంక్షేమ పాలన

- చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- లక్కవరంలో గడపగడపకు మన ప్రభుత్వం


గడపగడపకు కార్యక్రమంలో భాగంగా లక్కవరం గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని లక్కవరంలో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఎలీజా ఈ కార్యక్రమంలో పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నవరత్నాల పథకాలతో ప్రతి కుటుంబంలో లబ్ధి చేకూరిందన్నారు. విద్య, వైద్య, వ్యవసాయ రంగాలపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబర్చి అనేక కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. వలంటీర్లు, సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వం సంక్షేమ పాలనను తీసుకొచ్చిందన్నారు. గతంలో పింఛన్ పొందాలంటే దూర ప్రాంతాల్లో ఉన్న కార్యాలయాల వద్దకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఉండేదని ప్రస్తుత ప్రభుత్వంలో 1వ తేదీన ఇంటి వద్దకే వలంటీర్లు పింఛన్ నగదును లబ్ధిదారులకు అందించడం జరుగుతుందన్నారు. సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు అందుతున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా అందే సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. గ్రామాల్లో అభివృద్ధికి ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షలను ప్రభుత్వం కేటాయిస్తుందన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని, రానున్న ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఎమ్మెల్యే ఎలీజా కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి, సర్పంచ్ గెల్లా వెంకట రమణ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థసారథి, స్త్రీ శిశు సంక్షేమ రీజనల్ చైర్మన్ వందనపు సాయిబాల పద్మ, వైఎస్సార్ సీపీ నాయకులు వందనపు సూర్యప్రకాష్‌రావు, దల్లి నాగేశ్వరరావు, చిల్ల దుర్గారెడ్డి, చిట్టిబొమ్మ శివరామకృష్ణ, కొయ్య రమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.లక్ష విరాళం


దాత చలపతిరావుకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న ఆలయ సీనియర్ అసిస్టెంట్ శ్రీను

ద్వారకాతిరుమల : శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు ఒక భక్తుడు ఆదివారం రూ. 1,00,116 విరాళంగా అందజేశారు. రాజమహేంద్రవరానికి చెందిన కేశిరాజు వెంకట చలపతిరావు ముందుగా కుటుంబ సమేతంగా స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ సీనియర్ అసిస్టెంట్ మద్దాల శ్రీను విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

వాటర్ డిస్పెన్సర్‌ను బహూకరించిన ట్రైనీ కలెక్టర్


వాటర్ డిస్పెన్సర్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం శాఖా గ్రంథాలయానికి ఏలూరు ట్రైనీ కలెక్టర్ అపూర్వ భరత్ సుమారు రూ.12,550 విలువ గల వాటర్ డిస్పెన్సర్‌ను బహుకరించినట్లు గ్రంథాలయ అధికారిణి ఎస్.రామలక్ష్మి తెలిపారు. గతంలో కూడా ట్రైనీ కలెక్టర్ విద్యార్థులకు పోటీ పరీక్షలకు సంబంధించి రూ.15 వేలు విలువ గల పుస్తకాలను బహుకరించినట్లు ఆమె చెప్పారు. ఈ వాటర్ డిస్పెన్సర్‌ను ఆదివారం ప్రారంభించామని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ చైర్మన్ సోదెం క్రాంతి కిరణ్, మెంబర్లు అనంతాత్మకుల ఆశ్రిత, తదితరులు పాల్గొన్నట్లు ఆమె చెప్పారు.

100 శాతం రుణాల వసూలుపై అభినందన

పెదపాడు: ఆర్‌ఆర్ పేట డీసీసీబీ బ్రాంచి పరిధిలో గోగుంట సహకార సంఘం అధ్యక్షుడు బావరాజు సత్యనారాయణ, కమిటీ సభ్యులకు, సంఘ కార్యదర్శికి, సిబ్బందికి జిల్లా సహకార బ్యాంకు ముఖ్య కార్యనిర్వహణాధికారి బీ శ్రీదేవి లేఖ ద్వారా ఆదివారం అభినందలు తెలిపారు. 2023 జూన్ 30 నాటికి సభ్యుల నుంచి రావాల్సిన డిమాండ్ రుణాలు 100 శాతం వసూలు చేసినందుకు సంఘ అధ్యక్షుడు, కమిటీ సభ్యులకు, సంఘ కార్యదర్శికి, సిబ్బందికి జిల్లా సహకార బ్యాంకు తరఫున హృదయ పూర్వక సహకార అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో తమ సంఘం అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటున్నట్లు శ్రీదేవి లేఖలో పేర్కొన్నారు.

అసైన్డ్ భూముల చట్ట సవరణ నిలిపివేయాలి

ఏలూరు (టూటౌన్): పేదలకు నష్టం కలిగించేలా ఉన్న అసైన్‌మెంట్ భూముల చట్ట సవరణను నిలుపుదల చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం కోరారు. స్థానిక పవరుపేటలోని పార్టీ జిల్లా కార్యాలయంలో జిల్లా కమిటీ సభ్యులు తెల్లం రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన జిల్లా కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అసైన్డ్ భూములపై యాజమాన్య హక్కులు కల్పించడం వలన భూస్వాములకు, పెత్తందారులకు ప్రయోజనం కలిగి పేదలు నష్టపోతారన్నారు. గ్రామ సచివాలయాల వద్ద అసైన్‌మెంట్ భూముల ఆక్రమణదారుల పేర్లు బహిర్గతం చేయాలన్నారు. వెంటనే అసైన్‌మెంట్ కమిటీలను వేసి చర్చించాలన్నారు. పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ జిల్లాలో లక్షలాది ఎకరాల అసైన్‌మెంట్ భూములు భూస్వాములు చేతుల్లోనే ఉన్నాయన్నారు. ఈ భూములను బినామీల పేర్లతో దర్జాగా అనుభవిస్తున్నారన్నారు. అసైన్డ్ భూముల చట్ట సవరణ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు డీఎన్‌వీడీ ప్రసాద్, ఆర్.లింగరాజు, పి.కిషోర్, జి.రాజు, మొడియం నాగమణి, జిల్లా కమిటీ సభ్యులు కె.శ్రీనివాస్, బి.సోమయ్య, ఎం.జీవరత్నం, పి.రామకృష్ణ, టి.దుర్గారావు పాల్గొన్నారు.

వైఎంహెచ్‌ఏలో నేడు, రేపు స్వాతంత్య్ర వేడుకలు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరంలోని హిందూ యువజన సంఘం (వైఎంహెచ్‌ఏ) ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో స్వాతంత్య్ర వేడుకలు నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు యర్రా సోమలింగేశ్వరరావు, జవ్వాజి మోహన విఠల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 11 గంటలకు విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, మంగళవారం ఉదయం 10 గంటలకు జాతీయ పతాకావిష్కరణ, 11 గంటలకు విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 6 గంటలకు నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శన చేస్తారన్నారు. రాత్రి 7 గంటలకు బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

సంస్కృతానికి సముచిత స్థానం కల్పించాలి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్రంలో అమలు చేస్తున్న నూతన విద్యా విధానంలో సంస్కృత భాషకు కూడా సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ సంస్కృత భాష ఉపాధ్యాయ సంఘం నాయకులు కోరారు. ఆదివారం స్థానిక విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ సంస్కృత భాష ఉపాధ్యాయ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకున్న కాంపోజిట్ తెలుగు సంస్కృతం రద్దు చేయనున్నట్లు విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఉపాధ్యాయ సంఘాల సమావేశంలో తెలియచేయడంతో ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్కృత ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారన్నారు. సంస్కృత భాషకు తెలుగు, హిందీ, ఉర్దూ, ఇంగ్లిష్ భాషలతో సమానమైన ప్రతిపత్తి కల్పించాలని కోరారు. సంస్కృత ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి నూతనంగా సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘ గౌరవ అధ్యక్షులుగా ఆచార్య దోర్బల ప్రభాకర్ శర్మ, అధ్యక్షులుగా మరుధురి నరసింహాచార్యులు, ఉపాధ్యక్షులుగా రాంబాబు, కార్యదర్శిగా మాకన వెంకటేశ్వర్లు, కోశాధికారిగా శ్రీష్టి రఘురాం, మహిళా కార్యదర్శిగా గుడివాడ ప్రశాంతి, ప్రచార కార్యదర్శిగా తట్టా తాండవ కృష్ణ, ప్రధాన సలహాదారుగా ఎస్ఎల్ఎస్ శర్మలను ఎన్నుకున్నారు.

ప్రతిఒక్కరిలో జాతీయతాభావం పెంపునకు కృషి


కామవరపుకోట : ఆడమిల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం


రాజానగరంలో నా భూమి- నా దేశం కార్యక్రమంలో మట్టిని సేకరిస్తున్న దృశ్యం

కామవరపుకోట : భారతదేశ సమగ్రత కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కళాశాల అధ్యాపకులు ధరావత్ మల్లేష్ అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాలలో భాగంగా ఆడమిల్లి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. దేశ స్వాతంత్య్ర సాధన కోసం త్యాగమూర్తుల సేవలను వివరిస్తూ, నేల తల్లికి నమస్కారం – వీరులకు వందనం అంటూ దేశ భక్తి గీతాలను ఆలపిస్తూ ప్రజలలో జాతీయతాభావాన్ని పెంపొందించే విధంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పొలిటికల్ సైన్స్ అధ్యాపకులు ధారావతు మల్లేష్ మాట్లాడుతూ స్వాతంత్య్రం కోసం ప్రాణాలర్పించిన అమరవీరులను గుర్తు చేసుకోవాలని, దేశ సమగ్రత కోసం, మాతృ భూమిని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ఎం.హర్షవర్ధిని, కుమార్ రాజా, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మన్యంలో నా భూమి – నా దేశం

బుట్టాయగూడెం : ప్రజల్లో దేశభక్తిని పెంపొందించడానికి, వారిని ఉత్తేజ పరచడానికి నా భూమి – నా దేశం, నేలతల్లికి నమస్కారం– వీరులకు వందనం అనే నినాదంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం మన్యప్రాంతంలో విజయవంతంగా నిర్వహించబడుతుంది. ఈ నెల 9వ తేదీన ప్రారంభమైన ఈ కార్యక్రమం 20వ తేదీ వరకూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో నిర్వహించేందుకు ఎన్ఆర్ఈజీఎస్, మండల పరిషత్ అధికారులు ఏర్పాట్లు చేశారు. త్యాగమూర్తుల పేరిట శిలాఫలకాలు ఏర్పాటు చేయడం, వాటి చుట్టూ మట్టి ప్రమిదలతో దీపాలు ఏర్పాటు చేసి త్యాగమూర్తులను స్మరించుకుంటూ కృతజ్ఞతలు తెలియజేయడం వంటి కార్యక్రమాలను నిర్వహించారు. కాగా 14వ తేదీ వీరులకు వందనం కార్యక్రమం, జీవించి ఉన్న వీరులను సత్కరించే కార్యక్రమాలను నిర్వహించనున్నారు. 15వ తేదీ జాతీయ జెండాను ఎగురవేయడం, అలాగే 16వ తేదీ నుంచి 20వ తేదీ వరకూ ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలోని మట్టిని సేకరించి మండల పరిధిలో ఒక యువకుడిని ఎంపిక చేసి ఆ యువకుడితో మట్టి కలశాలను ఢిల్లీకి పంపే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. కాగా 28, 29 తేదీల్లో ఢిల్లీకి చేరుకుని అక్కడ జరిగే కర్తవ్యపథ్‌లో జరిగే ముగింపు కార్యక్రమంతో ఈ కార్యక్రమం ముగియనుంది.

కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్

జంగారెడ్డిగూడెం : కొబ్బరి రైతుల సమస్యలపై సోమవారం ఏలూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో ఆదివారం జరిగిన రైతు సంఘం మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విదేశీ కొబ్బరి ఉత్పత్తుల దిగుమతులు వలన కొబ్బరికాయలకు ధర పడిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఒక్కో కొబ్బరి చెట్టుకు కొబ్బరికాయలు కోతకు వ్యాపారులు రైతులకు ఏడాదికి రూ.1000 నుంచి రూ.1200 ధర ఇచ్చేవారని ఇప్పుడు ఆ ధర రూ.600 నుంచి రూ.700కు పడిపోయిందన్నారు. ఒక్కో కొబ్బరికాయకు రైతుకు రూ.6 నుంచి రూ.7 లు మాత్రమే ధర ఇస్తున్నారని చెప్పారు. పెరిగిన ఖర్చుల రీత్యా ఒక్కో కొబ్బరికాయకు రూ.15 ధర ఇస్తే గాని రైతుకు గిట్టుబాటు కాదని అన్నారు. ఈ పరిస్థితులలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే జోక్యం చేసుకొని నాఫెడ్, ఆయిల్ ఫెడ్‌లను రంగంలోకి దింపి రైతుల నుంచి కొబ్బరికాయలు కొనుగోలు చేసేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బొడ్డు రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల ధర్నాకు తరలిరండి


సాధారణ సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న ఎలక్ట్రికల్ వర్కర్లు

జంగారెడ్డిగూడెం : ఈనెల 21న ఏలూరు కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే భవన నిర్మాణ కార్మికుల ధర్నాను జయప్రదం చేయాలని ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ నాయకులు తీయ్యల గణేష్ పిలుపునిచ్చారు. జంగారెడ్డిగూడెం ఏరియా ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ధర్మన్న స్మారక భవనంలో ఆదివారం కోట శివకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో గణేష్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న డెత్, డెలివరీ, హాస్పిటలైజేషన్ తదితర క్లెయిమ్‌లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 21న ఏలూరు కలెక్టరేట్ వద్ద ప్రగతిశీల భవన ఇతర నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా జరుగుతుందన్నారు. ఈ ధర్నాకు అధిక సంఖ్యలో కార్మికుల పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో వనపర్ల నవీన్, బాలిన ధర్మరాజు, ఆవుల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల పేరిట సమాజసేవ ఆదర్శనీయం


దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందచేస్తున్న సీఐ మల్లేశ్వరరావు

చింతలపూడి : తల్లిదండ్రుల పేరిట సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహించడం ఆదర్శనీయమని, ప్రతి ఒక్కరూ సమాజసేవలో భాగస్వాములు కావాలని సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక జామియా మస్జీద్ ఆవరణలో అజీమ్ ఛారిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఛారిటీ ఫౌండర్ ఎస్‌కే ఆజాద్ బాబు ఇద్దరు విభిన్న ప్రతిభావంతులకు ఆర్థిక సహాయం, నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. పాత చింతలపూడి గ్రామానికి చెందిన అజీజ్‌కు రూ.5 వేలు, షేక్ ఖాసిం అనే దివ్యాంగుడికి బియ్యం, నిత్యవసర వస్తువులను సీఐ ఎంవీఎస్ మల్లేశ్వరరావు, ఎస్సై కె ప్రసాద్ చేతులమీదుగా అందచేశారు. కార్యక్రమంలో మస్జీద్ కమిటీ అధ్యక్షుడు ఎస్‌డీ రహీమ్(బాబు), కార్యదర్శి ఎండీ జిలాని, జమాతె ఇస్లామి హింద్ నాయకులు ఎండీ అక్బర్ ఆలీ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు జి.రాజేష్‌నాయుడు, ఎంఏ రజాక్, ఎస్‌డీ ఖాజా, హాజీ, రబ్బాని, రఫీ, అల్లా భక్షు, ఇమ్రాన్, అమీర్‌పాష, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన వాలీబాల్ పోటీలు



జంగారెడ్డిగూడెంలో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : ఈశా రెజువనేషన్ ట్రోఫీ 2023 పోటీలు జంగారెడ్డిగూడెంలో నిర్వహించారు. 15వ గ్రామోత్సవం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో రెండురోజులపాటు వాలీబాల్ (పురుషులు), త్రోబాల్ (మహిళలు) పోటీలు నిర్వహించారు. స్థానిక సీఎస్‌టీఎస్ కళాశాల వద్ద నిర్వహించిన ఈ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్లస్టర్ లెవెల్‌లో ఈ పోటీలు నిర్వహించడం జరిగిందని, సెప్టెంబర్ 23న కొయంబత్తూరు ఈషా యోగా కేంద్రంలో ఫైనల్స్ నిర్వహిస్తారన్నారు. వాలీబాల్ ప్రథమ బహుమతి రూ.5 లక్షలు, త్రోబాల్ మొదటి బహుమతి రూ.2 లక్షలు అందజేస్తున్నట్లు తెలిపారు.

శ్రామిక మహిళల హక్కుల కోసం ఉద్యమించాలి


ఏలూరు (టూటౌన్): సమాజంలో శ్రామిక మహిళల హక్కుల కోసం ఐక్య ఉద్యమాలకు సిద్ధం కావాలని శ్రామిక మహిళా సమన్వయ కమిటీ (సీఐటీయూ) రాష్ట్ర నాయకురాలు దయా రమాదేవి పిలుపునిచ్చారు. ఏలూరులో యూనియన్ జిల్లా కార్యాలయంలో ఆదివారం జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. శ్రామిక మహిళలకు నేటికీ సమాన వేతనాలు అమలు కావడం లేదన్నారు. అనేక చోట్ల వేధింపులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం పథకాలను అమలు చేస్తూ ప్రజలకు అనేక సేవలందిస్తున్న ఆశా, అంగన్‌వాడీ, మిడ్‌డే మీల్, మెప్మా, కార్మికులను పర్మినెంట్ చేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని కోరారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కె.సుభాషిణి, సుధారాణి, దుర్గాంబ, ఎం.నాగమణి, చెల్లాయమ్మ, పి.వెంకట రమణ, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ కె.విజయలక్ష్మి, సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.లింగరాజు, డీఎన్‌వీడీ ప్రసాద్ పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ


ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటిలో ఓటర్ల వివరాలను యాప్‌లో పొందుపరుస్తున్న సిబ్బంది

ఏలూరు టౌన్: ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణను పారదర్శకంగా చేపట్టాలని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని చెప్పారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ ఓటర్ల జాబితా పరిశీలన కార్యక్రమాన్ని వార్డు సచివాలయం పరిధిలోని పోలింగ్ బూత్ స్థాయి అధికారులు ఆదివారం నిర్వహించారు. ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ఇంటికి వెళ్లిన బీఎల్‌వోలు ఇంటిలో ఓట్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాలోని పేర్లతో సరిచూసి, వాటిలోని వివరాలను యాప్‌లో పొందుపరిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆళ్ల నాని మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణలో ఎలాంటి విమర్శలకు తావులేకుండా బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల జాబితా సవరణను పారదర్శకంగా, నిబద్ధతతో చేయాలని సూచించారు. ఓటర్ల జాబితా స్వచ్ఛీకరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోపే పూర్తి చేయాలన్నారు. ఒకే ఇంటి నంబర్‌లో అధిక సంఖ్యలో ఓట్లు ఉంటే వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డూప్లికేట్ ఓట్లు, చనిపోయిన వారి ఓట్లు, ఇతర ప్రాంతాలకు తరలివెళ్ళిన వారి ఓట్లను తొలగించే సమయంలో కేంద్ర ఎన్నికల కమిషన్ జారీ చేసిన నిబంధనలు విధిగా పాటించాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు ఉండేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా ఓటర్ల జాబితాలో నమోదుకు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నాని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో కె.రవికుమార్, సచివాలయ సిబ్బంది, ఉన్నారు.

విద్యార్థులకు విలువలు బోధించాలి


ఆర్‌జేడీ విజయ భాస్కర్‌ను సన్మానిస్తున్న అపుస్మా ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థులకు పాఠ్యాంశాలతో పాటు మానవ విలువలను సైతం సందర్భానుసారం బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని పాఠశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ బి.విజయ భాస్కర్ సూచించారు. ఏపీ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (అపుస్మా) దెందులూరు నియోజకవర్గ స్థాయి సమావేశం స్థానిక వైఎంహెచ్ఏ హాలులో ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయభాస్కర్ మాట్లాడుతూ విద్యార్థులను భయపెట్టకుండా ఇతరులతో పోల్చకుండా మంచి ఉదాహరణలతో పాఠ్యాంశాలను బోధించాలన్నారు. ప్రతి పాఠ్యాంశంలో మానవ విలువలు ఇమిడి ఉంటాయని, వాటిని విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలన్నారు. ఇంపాక్ట్ ఫౌండేషన్ సైకాలజిస్ట్, మోటివేషనల్ స్పీకర్ ఎ.నాగేశ్వరరావు మాట్లాడుతూ మానవ మెదడు ఎంతో శక్తివంతమైనదని, సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణలు మానవ మస్తిష్కం నుంచే వెలువడినవనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. దెందులూరు మండలంలోని 37 ప్రైవేట్ స్కూల్స్ నుంచి ఒక్కొక్క ఉత్తమ ఉపాధ్యాయుడు, ఉత్తమ ఉపాధ్యాయినిని ఎంపిక చేసి టీచర్స్ ఎన్‌రిచ్‌మెంట్ కార్యక్రమం కింద ఘనంగా సన్మానించారు. అపుస్మా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఎన్ శ్రీకాంత్, రాష్ట్ర సలహాదారు కె.సురేష్ బాబు, జిల్లా అధ్యక్షుడు జి.బుల్లబ్బాయి, దెందులూరు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.రాజ్‌కుమార్, జి.వెంకట రమణ పాల్గొన్నారు.

రంగా విగ్రహం ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

ఏలూరు (టూటౌన్): కలిదిండి మండలం సానారుద్రవరం గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తులు వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ధ్వంసం చేయడాన్ని ఏలూరు జిల్లా కాపు సంక్షేమ సేన అధ్యక్షులు పులి శ్రీరాములు ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. దీనికి కారకులైన వారిని కనిపెట్టి కఠినంగా శిక్షించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

టేకు పూల సోయగం


బుట్టాయగూడెం మండలం బైనేరు సమీపంలో కనువిందు చేస్తున్న టేకుచెట్ల పువ్వులు

బుట్టాయగూడెం : ఏజెన్సీ ప్రాంతంలో టేకు చెట్ల పూలు కనువిందు చేస్తున్నాయి. రోడ్ల వెంబడి ఉన్న చెట్లు గుత్తులు గుత్తులుగా వికసిస్తున్న ఈ పూల పరిమళం రహదారి వెంబడి గుబాళిస్తున్నాయి. బుట్టాయగూడెం, కన్నాపురం రహదారి బైనేరు వంతెన వద్ద ఈ టేకు పువ్వుల అందాలను చూసి అందరూ అబ్బురపడుతున్నారు.

కొండయ్య మృతి యూటీఎఫ్‌కు తీరని లోటు


కొండయ్య (ఫైల్)

కుక్కునూరు : విద్యార్థి ఉద్యోగ సమస్యలపై జరిపే ఉద్యమాలలో చురుకుగా ఉండే కొండయ్య మృతి యూటీఎఫ్ సంఘానికి తీరని లోటని సీఐటీయూ మండల కార్యదర్శి యర్నం సాయికిరణ్ పేర్కొన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో యూటీఎఫ్ కుక్కునూరు మండల అధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించిన కొండయ్య , శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయుల సమస్యలపై జరిపిన ధర్నాలో గుండెపోటుకు గురై మృతి చెందడం పట్ల ఆదివారం ఒక ప్రకటనలో విచారం వ్యక్తం చేశారు. కొండయ్య కుటుంబసభ్యులకు సీఐటీయూ కుక్కునూరు మండల కమిటీ తరుపున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ముగ్గురిపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం : పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో పనిచేస్తున్న పంగిడిగూడెంకు చెందిన తోట రాంబాబును అదే గ్రామానికి చెందిన దొడ్డిగర్ల సూర్యచంద్రం మరో ఇద్దరు కలిసి కొట్టి గాయపర్చిన నేరంపై ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ పీసీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. వివరాల ప్రకారం రాంబాబుకు వివాహమై ఒక పాప ఉండగా అదే గ్రామానికి చెందిన దొడ్డిగర్ల నాగేశ్వరమ్మతో గతంలో ప్రేమ వ్యవహారం నడిచింది. ఈ నేపథ్యంలోనే ఈ నెల 11న రాంబాబు, అతని అన్నయ్య మోటార్‌సైకిల్‌పై వెళుతుండగా, పంగిడిగూడెం గ్రామ శివారు ఆంజనేయస్వామి విగ్రహం వద్ద సూర్యచంద్రం, మరో ఇద్దరు కలిసి అడ్డగించి కొట్టి గాయపర్చారు. దీనిపై రాంబాబు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అప్పు తీర్చమన్నాడని..

జంగారెడ్డిగూడెం : అప్పు తీర్చమని అడిగిన వ్యక్తిని గాయపర్చిన నేరంపై ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.సాగర్‌బాబు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన మానూరి సోమయ్య అదే మండలం వెంకటకృష్ణాపురానికి చెందిన సుంకవల్లి శేఖర్‌కు 2021లో రూ.2 లక్షలు అప్పుగా ఇచ్చాడు. కాగా జూన్ 25న శేఖర్, సోమయ్య, మరో వ్యక్తి గుబ్బల మంగమ్మ గుడికి వెళ్లారు. తిరిగి వచ్చే క్రమంలో పట్టణంలోని గాయత్రి బార్ అండ్ రెస్టారెంట్ వద్ద ఆగగా డబ్బుల విషయమై శేఖర్, మరో వ్యక్తి సోమయ్యతో గొడవపడి అతడిని, సోడా సీసాతో కొట్టారు. తలకు గాయడం కావడంతో స్పృహ తప్పి పడిపోయిన సోమయ్యను నిందితులు అతని ఇంటి సమీపంలో వదిలి వెళ్లిపోయారు. ఈ విషయంపై పెద్దల సమక్షంలో పెట్టినా తేలకపోవడంతో ఆదివారం బాధితుడు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

సాగునీటి సమస్య పరిష్కారంపై హర్షం

దెందులూరు: కృష్ణా, గోదావరి డెల్టాల శివారు ప్రాంత ఆయకట్టుకు సాగునీరు అందక రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారని, ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి చర్యలు చేపట్టడం హర్షణీయమని ఏపీ రైతు సంఘం నాయకులు శ్రీనివాస్, రైతు నాయకులు అన్నారు. ఆదివారం సత్యనారాయణపురం వద్ద గుండేరు వాగుపై అడ్డుకట్ట వేసి గోదావరి, ఏలూరు కాల్వకు సాగునీరు మళ్లిస్తున్న ప్రాంతాన్ని వారు పరిశీలించారు. పోణంగి పుంత కాల్వ ద్వారా ఏలూరు మండలంలో శివారు ప్రాంతాల్లో సాగునీరందేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంట కాల్వలో గుర్రపుడెక్క, తూడు పూడికతీత పనులు చేపట్టాలని మండల కార్యదర్శి సున్నా వెంకట్రావు, కొల్లి విజయభాస్కరరెడ్డి, రైతులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు, రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు.